కథ

ఆనందమయి! నీ వసంతం!



రేవతీనంద

ఆనందమయి! నీవీ రోజు చాలా అందంగా ఉన్నావోయ్. ప్రత్యేకంగా శింగారించుకున్నావే ... దేనికబ్బా ... ఓహో ... నీ పుట్టిన రోజు కదా ఈరోజు. సరే ఎంతసేపని అలా ఆ నిలువుటద్దం ముందు నిలబడి నీ అందం నీవే చూసుకుంటావ్. అలా కాసేపు ఆ బాల్కనీలోకెళ్లి నిలబడు. నీ మగడు దయాకర్ వస్తున్నాడేమో. ఈ రోజన్నా నీ మీద దయతలచి తన పనులన్నీ ముగించేసుకుని త్వరగా ఇంటికి చేరతాడేమో చూద్దాం.

ఈ రోజన్నా కాస్తత్వరగా ఇంటికి రండీ! అని అతన్ని కోరావు కదా!

ఆనందా! చూడు! ఈ సాయంత్రంవేళ బయట ఎంత ఆహ్లాదంగా ఉందో! చల్లని గాలి వీస్తోంది కదూ! ఇలా ఉంటే నీకెంతో ఇష్టం కదా! బాల్కనీలో కుర్చీవేసుకూర్చుని, పిట్టగోడ మీద చేతులు పెట్టుకుని వాటి మీద గడ్డం ఆన్చి అలా రోడ్డు మీదకు చూస్తూ, భర్త ఎప్పుడు వస్తాడా అని ఆరాటంగా చూడ్డం. ఆ తరువాత రోడ్డుమీద పోయే జనాలని గమనిస్తూ వాళ్ల సంసారాలను అంచనా వేసుకుంటూ ఉంటావు కదూ!

అదుగో ఆ భార్యాభర్తల జంట చూడు వాళ్లు ఎంత అన్యోన్యంగా ముచ్చట్లాడు కుంటూ పోతున్నారో కదూ! వాళ్లిద్దరూ చిన్న వయసు వాళ్లే.

ఆ భర్తేమో భార్యభుజాల మీద చేయివేసి భార్యముఖాన్ని అనురాగంగా చూస్తూ ఏవో ముచ్చట్లు చెబుతూంటే, ఆ భార్య హుందాగా చేతులు కట్టుకుని, ముసిముసి నవ్వులు నవ్వుతూ ఎంతరమణీయంగా నడుస్తోంది! చాలా బాగుంది కదోయ్ ఆ దృశ్యం.

కనీసం ఒక్కసారి ఒక్కసారైనా నీవూ నీ భర్తా కలసి అలా పది అడుగులైనా వేశారా! మీ పెళ్లయిన ఈ రెండు సంవత్సరాల్లో అలాంటిది మచ్చుకైనా జరగలేదని వాపోతున్నావా! ప్చ్! అంతేనోయ్! నీకు అలాంటి కోరికలుండవచ్చునేమో కాని నీ భర్తకి ఉండొద్దూ!

అదేమిటి అలా ముఖం విసుగ్గా పెట్టావు నీ భర్త నిన్ను నిర్లక్ష్యం చేస్తున్నాడనా! నీ అందాన్ని, నీ కోరికని, అసలు నీ బాగోగులని పట్టించుకోని నిర్దయుడు, జడుడు అని తిట్టుకుంటున్నావా!

పాపం! ఆనందా! మొదటినుంచీ నీవు కోరుకున్నట్టు నీ భర్త ప్రవర్తించనూ లేదూ! నీ సంసారం నీవు కోరిన విధంగా సాగిపోవడమూ లేదు కదూ! ఏం, బాధపడుతున్నావా! బాధే కాదు ... కుమిలిపోతున్నావు కదూ!

నీవు చదువుకునే రోజుల్లో, భవిష్యత్ గురించి ఎన్నికలలు కన్నావు. ఊహలలో మునిగి స్వాప్నిక జగత్తులో విహరించావు. అవునా, కాలేజీలో అందాలరాణిగా పేరుతెచ్చుకున్నావు! కాని గర్వంగా ఎప్పుడూ ప్రవర్తించే దానివే కాదు కదూ! నీ ప్రవర్తనకి తగ్గట్టే నీ కోరికలున్నాయి. మంచి స్వభావం కలిగిన భర్త కావాలనుకున్నావు. ఆ భర్త చిరు ఉద్యోగైనా ఫరవాలేదనుకున్నావు.

అతడు రోజులో కొంత టైం నీతో గడిపితే చాలనుకున్నావ్. అలాంటి భర్తకి ఆదర్శ గృహిణిగా ఉండి అతనికి సేవచేస్తూ అతని మెప్పు పొందితే అప్పుడు నీకెంతో తృప్తి కదూ! అలాంటి భర్త అనురాగం పంచుకుంటూ గడిపేయడమే నీవనుకున్న సంసార జీవితం అని ఎంత బలంగా కోరుకున్నావో కదా! ప్చ్! నీ కోరికలు ఇక్కడ తునిగిపోయాయి. నీ ఊహలు చెదిరిపోయాయి.

ఏమిటి, ఆనందా! మాటిమాటికీ అలా రోడ్డు మలుపు చూస్తావు, నీ దయాకర్ వస్తాడనా! ఔన్లే, నీకటి కూడా పడుతోంది. వేడుకలేని నీ బర్తడే వెలుతుర్ని కోల్పోతుంది. ఆ వేడుకని పంచుకునే భర్త ఇంకారాడేం. ఈ రోజుకి కొంత ప్రత్యేకత ఉందని అతడు గుర్తించాడా! మరిచిపోయాడేమో! అసలింతకీ అతడు వచ్చి ఏం చేస్తాడ్లే, రోజూ వచ్చినట్టే వస్తాడు ఎప్పుడో! ఒక టైమూ పొడా! ఇలా వస్తాడో లేదో బట్టలు మార్చుకుని, బడలిక ముఖం పెట్టి, విసుగ్గా ఏవో రెండు మూడు మాటలు తుంచి తుంచి మాట్లాడతాడు అంతేగా! కాదా! మరి ఏం చేస్తాడేంటి!

రాగానే, నీవు తలుపు తీయగానే హాయ్!ఆనందా ఈ రోజెంత అందంగా ఉన్నావో! డార్లింగ్ - అని బుగ్గన చిటికేస్తాడా! పోనీ పొంగిపోయే ఆనందంలో నిన్ను ఎత్తేసి గిరగిరా తిప్పేసి అలాగే బెడ్‌మీదకి తీసుకెళ్లి ఇంకేవేవో చిలిపి పనులు చేసేస్తాడా! నిజంగా అలా చేస్తే నీ కెంతో ఆనందం కదూ! నీకే కాదు భర్త కోసం అంత ఆరాటంగా ఎదురుచూసే ప్రతి స్త్రీ భర్త నుంచి అదే కోరుకుంటుంది కదూ? అంత ఎదురు చూపుకి భర్త కనీసం ఆ చిలిపి ముచ్చట తీర్చడం సబబే!

పోనీలే. ఈ రోజన్నా నీ దయాకరుడు అలా ప్రవర్తిస్తాడేమో చూద్దాం. ఎలానూ! ఏ రోజు, ఏ అందమైన సాయంత్రమున్నూ నీవు నీ భర్త కలసి అలా షాపింగ్‌కో, సినిమాకో, ఏదన్నా పార్కుకో.... కాసేపు సరదాగా అలా తిరిగి రావడం జరగదు కదా! అలా జరిపించే వాడూనా, నీ భర్తగారు. ఊహు కాదు. అలాంటి పిండం కాదు నీవాడు. నీ భర్తేకాదు ... ఇంకెంత మంది ఇలాంటి భర్తలుండరంటావు లోకంలో.. కో...కొల్లలు...కాని చాలా చాలా మందికి తెల్సోయి. భార్యలని ఎలా సుఖపెట్టాలి... వారి కోరికలు, వారి బాగోగులు, గట్రా అన్నీ తెల్సు. కాని ఎంతమంది అమలుపర్చుతున్నారంటావ్! ఈ మెకానికల్ జీవితాలలో...ఇవన్నీ వ్యాపారబంధాలు. అంతా డబ్బు ప్రపంచం, డబ్బు ముందూ, డబ్బు సంపాదించాలి అనే దుగ్ధ ముందూ ఈ బంధాలు, ఈ అనురాగాలు, ఈ ఆదర్శాలు, కోరికలు, స్వేచ్ఛలు అన్నీ దిగదుడుపు. ఒక్క మాటలో చెప్పనా! ఈ సంసారం ఒక జీవ నాటకం. నీది ఓ భార్య పాత్ర ఆ దయాకర్‌ది ఓ భర్త పాత్ర.

సర్లే ఏంటి అలా చిరాగ్గా చూస్తున్నావ్! ఆ రోడ్డు మీద నిలబడివున్న ఆ కుర్రాడు ఇటే చూస్తున్నాడనా! సిగ్గు ఎగ్గూ లేకుండా అలా నిలబడి కన్నార్పకుండా చూస్తాడేంటి! ఎప్పట్నించి చూస్తున్నాడో ఏమో నీవు గ్రహించనేలేదు. ఈ కాలం కుర్రాళ్లందరూ ఇంతేనేమో. రోడ్డు మీద కన్పించిన ప్రతి ఆడదాన్ని గుడ్లు మిటకరించి చూస్తారు.

పుట్టిం తర్వాత ఆడదాన్ని చూడ్డమే మొదటగా అన్నట్టు... నీవెన్ని తిట్టుకున్నా ఏం లాభంలే. అది రోడ్డువాళ్లిష్టం. ఎందుకలా నిన్ను చూడాలని అనుకుంటే లాభం లేదులే... అసలే అందంగా ముస్తాబై ఉన్నావ్. బాల్కనీలో కూర్చుని అభిసారికలా కన్పిస్తున్నావ్. నీవు పట్టించుకోకున్నా, రోడ్డుమీది జనాలు చూడరా.. చూస్తూ పోరా. నీవిలా కూర్చోవడం వాళ్లకి చులకనగా ఉందికాబోలు.

ఆడది అందంగా ఉంటే ఒక చిక్కు. ఒంటరిగా కన్పిస్తే ఒకచిక్కు. కొంచెం చనువుగా మాట్లాడితే మరీ చిక్కు. అన్నీ చిక్కులే. చిక్కులతో అల్లిన బతుకు ఇది. ఈ పాకుడుబట్టిన బండలాంటి జీవితంలో ఆడది ఎంత జాగ్రత్తగా నడవాలి. నీవు చదువుకునే రోజుల్లో ఎన్నెన్ని చిక్కు వలయాల్ని ఛేదించుకొచ్చావు. ఎంతమంది మగరాయుళ్ల బారినపడి చాకచక్యంగా తప్పించుకొచ్చావు. అసలే కాలేజీ బ్యూటీవి కదా! ఎంతమంది కుర్రాళ్లు నీ మీద కన్నేసి తిరగలేదూ! నీచుట్టూ ప్రేమా దోమా అని వెంటబడలేదూ. ఆ కిరణ్ నీ క్లాస్ మేట్, అతడెంతగా నిన్ను ప్రేమించానని నీ వెంట పిచ్చిగా తిరిగాడా లేదా! నీవు ప్రేమించకుంటే చచ్చిపోతాననలేదా! అప్పుడు నీవేమన్నావ్. వెళ్లి అర్జంటుగా చావు అని కర్కశంగా శాసించావ్, ఆఫ్‌కోర్స్ అతడు చావలేదనుకో.

అబ్బా: ఆనందా! అప్పుడే ఎనిమిదయింది. నీ భర్తగారు ఈ రోజు మరీ లేట్ చేశాడే. ఇంత వరకూ రాలేదు. రోడ్డుమీద జనాలు కూడా పల్చబడ్డారు. ఇక ఇలా కూర్చుని నీ మగనికోసం చూడ్డం ఎంత విసుగ్గా అన్పిస్తుందో కదా! ప్చ్.... తలనొప్పి కూడా వస్తుందా! నీరసంగా కూడా కన్పిస్తున్నావ్. అయినా నీ అలంకరణ నలగలేదులే. నీరసంతోనూ ఏదో కొత్త అందం కన్పిస్తుంది. అది ఇంకా వీడిపోకుండా నిలిచి ఉంది.

ఆ... అంత ఆత్రంగా చూస్తావే.. గేటు చప్పుడయిందనా, నీ మగడు వచ్చాడనుకున్నావా! కాదు... సరిగ్గా చూడు. ఎవరో పడుచు స్త్రీనే. గేటు తీసి విలాసంగా వెళ్లిపోతోందే. ఆ అమ్మాయి ఎవరబ్బా! కిందిపోర్షనులో ఉండే నీ కబుర్ల నేస్తం అరుంధతి అనుకున్నావా. కాదు..అదుగో అరుంధతి భర్త రామ చంద్రమూర్తి. ఆ అమ్మాయికి వీడ్కోలు చెబుతున్నాడు. గేటు మూసి వెనక్కి తిరిగి వస్తూ పైకిచూసి అలా ఆగిపోయాడే. అలా నిన్ను చూస్తూ ఇకిలిస్తాడేంటి! అసలతనికి భయం, భక్తి, ఏమన్నా ఉన్నాయా అని. ఈరోజు కొత్త కాదు కదా! నీవెప్పుడు కన్పించినా మింగేసేట్టు ఘూస్తాడు, వెధవ! గుంట నక్కల - వాడూ వాడి ముఖం. సంస్కార హీనుడు. ఛా.. అనుకుంటున్నావా! అలా విసురుగా లోపలికొచ్చాసావేంటి! తలనొప్పిగా ఉందా! అలా బెడ్ మీద వాలి పోయినంత మాత్రాన ఆ తలనొప్పి ఆ చికాకు పోతాయా! ఆ రామచంద్రమూర్తిని చూస్తే చాలు వంటిమీద ఉర్రి పాకినట్టుంటుంది కదూ! ఆ అరుంధతికి ఎలా దాపురించాడో..ఎలా భరిస్తోందో గాని, అంత మంచి మనసున్న అరుంధతికి ఎంత అన్యాయం చేస్తున్నాడో కదా! అలా అనుకుంటే నీ భర్తగారు ఆ దయాకర్ మాత్రం ఎలా ప్రవర్తిస్తున్నాడేంటే... నిన్ను నిర్లక్ష్యం చేయడమే ఓ తీరని అన్యాయం.

ఏమిటీ! తలుపు చప్పుడవుతున్నదే. ఎవరొచ్చి ఉంటారు. దయాకరే... తియ్యి తలుపు... ఆ... ఏమిటి సిగ్గేస్తుందా. నీ మేకప్పేమీ చెదిరిపోలేదు లేవోయ్. సిగలో మల్లెలు నలగలేదులే. మహారాణిలా ఉన్నావ్. వెళ్లి తలుపు తియ్యి. ఎంతసేపని బయట నిలబడతాడు.

హమ్మయ్యా .... వచ్చాడా ... నీ మగడు. వచ్చాడు సరేగాని అదేంటి అతని ముఖం అంత నీరసంగా ఉంది. నీవైపు అంతనిర్లక్ష్యంగా చూస్తాడేంటీ. ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వడే. ఆ... అలా బెడ్ రూమ్‌లోకి చొరబడుతున్నాడు సరాసరి.

ఆనందా! నీ భర్త నిజంగా రసహీనుడు. నిర్దయుడు. ఇప్పుడు నీ పరిస్థితి చూస్తే చాలా జాలిగా ఉంది. ఇప్పటి వరకూ కళ్లల్లో వత్తులు పెట్టుకుని ఎంతగా అతని కోసం ఎదురు చూశావో! దానికతడు కొంచమైనా రెస్పాన్స్ ఇస్తే కొంతైనా ఊరటగా ఉండేదేమో! సరే కానియ్ ఇది రోజూ జరిగే తంతేకదా!

అతడు బట్టలు మార్చుకుని బడలికగాపడుకున్నాడు. నీవేమో మాటా పలుకూ లేకుండా అలా భోజనానికి సిద్ధం చేస్తున్నావ్. వెళ్లి అడుగు ఎందుకలా ఉన్నాడో.

ఏమిటీ! ఏమన్నాడు, భోజనం చేసి వచ్చాడట, ఎక్కడా! అతడి కొలిగ్ ఇంటిలోనా. ఎందుకని, ఆ కొలిగ్ భార్య బర్తడే అయితే గెస్ట్‌గా వెళ్లాడా! ఊ... బాగానే ఉంది అతని వరస.... ఇంట సౌభాగ్యాన్ని విడిచి వీధినపడి వెతికినట్టు ఏం మొగుడో ఏం బతుకో... ప్చ్!

ఏమిటి ఆనందా! అలా నీరసించిపోయావు. అలాసోఫాలో కూలబడ్డావ్ ఏమిటి. మనసంతా వికలంగా ఉందా! పిండినట్టవుతుందా! ఊ... అంతగా బాధపడకు. అలా కన్నీరు కార్చకు.. ఏడిస్తే, పోతుందా...బాధపడితే బాగుపడే పరిస్థితా... అర్థంచేసుకొని మెలగడు. అలా మొద్దులా గుర్రుపెట్టినిద్ర పోతున్నాడు. తెలుసుగా అతని రోజూ ప్రవర్తన, కాకుంటే ఈరోజు కనీసం నిన్ను గుర్తుపెట్టుకోవలసింది. పుట్టిన రోజని ఏ రాళ్లనెక్కెస్తో... ఏ కంచి పట్టుచీరో.. తీసుకురమ్మనలేదు కదా! కాస్త త్వరగా ఇంటికి రమ్మన్నావ్... అంతే ... ఆమాత్రం కోరిక తీర్చని మొగుడు. దయాకర్... ఛీ...ఏమిటి ఆనందా! అంత విరక్తి. ఎప్పుడూ లేదే. విచిత్రంగా ప్రవర్తిస్తున్నావ్... బాధతో ఆ పెదాలు కొరికేసుకుంటున్నావ్. ఆవేశంగా ఆలోచించడం అనర్థం. నీలాంటి వివేక వంతురాలు తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం తగదు.

సంసారం ఆరంభంలో కొత్త కాబట్టి, అతను అర్థంకాలేదు. అతని ప్రవర్తన అంతే. ఊ.. నీవు ఇంత కాలం ఏకాంతపు బాధను అనుభవిస్తూ ఓపిక బట్టేవు బానే ఉంది. అయితే ఇంతదారుణమైన నిర్ణయం తీసుకుని ఏం చేద్దామని. వేరయిపోవడం నీ సంస్కారానికి, నీ ఇల్లాలి సుగుణ తనానికి సరిపడనిది. భర్త నుండి దూరమవ్వడం ఓ దుర్భరం. ఈరకంగా బతకడం మరోదుర్భరం.

సంసారం ప్రారంభం నుండి భర్త నుంచి నీవు ఆశించింది ఏమాత్రం పొందలేదు. నిజమే. అయితే ప్రతి ఇల్లాలు ఏదో స్వార్థంగా ఆలోచించి ఏదో ఆశించి కాపురానికి వస్తుందంటావా! ఈ రోజుల్లో అలానే ఉన్నాయిలే - సంసారాలు. తనని సరిగా చూసుకోమని భార్యా భర్తని కాలర్ పట్టుకుని అడగవచ్చు. ఎందుకంటే ఎన్నో వేలు, లక్షలు పోసి కొనుక్కొంటున్న దౌర్భాగ్యపు పెళ్లితంతు పరిస్థితికదా! మనిషికున్న విలువలు మట్టికరిచి చాలా కాలం అయింది. నోటు మాటున వనిత విలువలున్నాయి. నోటుతో రమించే మనిషా! నీకు స్పందనలు లేవు. ప్రేమలు లేవు. బాంధవ్యాలు లేవు. దౌర్భాగ్య ధనమ్ మూలం మిధమ్ జగత్. ఎవడిక్కావాలి ఈ సామెత.ఆనందాన్ని నాశనం చేసి నిరుత్సాహమయంచేసింది ధనం. ఈ కొంపలో మొగుడుఉద్యోగ సంపాదనా ధనమేగా. మొగుడు రూపంలో తనని నిర్లక్ష్యం చేస్తుంది. ఉద్యోగం.. ఉద్యోగం.... పొద్దున పోయి రాత్రికి రావడం.... ఉద్యోగంకోసం పుట్టాడా ... ఆఫీస్ జీవితమా ... ఈ దయాకర్‌కి... ఇతనికి పెళ్లెందుకు. భార్యెందుకు. దయాకర్‌కే కాదు, ఈ రకమైన వాళ్లకి, ఇలా ప్రవర్తించే వాళ్లకి పెళ్లికావాలా! తోడుకావాలా! మనిషి కావాలా. ఆడ మనిషి కావాలా. డబ్బు కావాల. ఉద్యోగంకావాల. వ్యాపారాలు కావాల.

ఉత్తమ ఇల్లాలుగా బతుకుదామని కోరుకోవడం తప్పేమో, ఏం ఆశించి ఈ బతకడం. పంజరంలో చిలకలా మూగరోదన మింగుతూ కుమలడం. అర్థంచేసుకొని మొగుడు. మొగుడన్నా మోడులాంటి బతుకు వ్యాపకంకోసం ఉద్యోగం చేస్తానంటే.. ఉద్యోగమా సజ్జోగమా. సలిగిపోతావ్, వాడిపోతావ్ అనే వాడితడు. ఇంట్లోనే చావమని శాసిస్తున్నాడా! ఈ విధంగా బాధించడానికే వాడిచ్చాడు అధికారం. ఈ సౌమ్యమేమో. ఈ సుకుమారమేమో కదా. అవును. అవును. అయితే - ఈ భర్త ఈ దయాకర్ ఎంతవరకూ శాసిస్తాడు? ఎంత వరకూ నిర్లక్ష్యం చేస్తాడు? ఉన్నంత వరకే.... బతికున్నంతవరకే. అందుకే... అందుకే... లేకుండాపోతే... లే...కుం...డా పో.. తే....

షటప్! ఆ..నం..ద..మ...యీ. చాలు... ఇక... ఆపు. నీ మూర్ఖ ఆలోచనకు జోహారు. చచ్చి ఏం సాధిద్దామని. నీ చవట ఆలోచన. స్థిమితపడవోయ్ ఆనందమయీ! నీవు తెలివైన దానివి. విశాలంగా ఆలోచించే దానివి. జన జీవితాలని... సంఘపు తీరు తెన్నులను ఆకళింపు చేసుకునే దానివి. ఇంతదీలా పడిపోతావెందుకు. మార్చుకో... నీ మనస్సు మార్చుకో. నీవైపు తిప్పుకో. నీవు కోరుకున్న అనురాగాన్నీ, అన్యోన్యతను అతని నుంచి పొందు. నీవు అనాథవు కాదు. నీవు ఒంటరి దానవు కాదు. నీడపట్టున విశ్రమించే జీవితంనీది. నీకు భర్త ఉన్నాడు. నీవు... నీవు... నా... కన్నా... ఎంతో అదృష్టవంతురాలివోయ్...చూడు... ఆనందా.. నన్ను చూడు. యవ్వనాన్ని కప్పుకున్న ఈ పడికి శరీరం.. సంస్కారణ లేక వాడిపోయి ఉంది. సగం శరీరాన్ని కప్పే చాలీచాలని దుస్తుల మధ్య... వంపు సొంపులను దాచుకోడానికి నేనుపడే వ్యథ... ఇవన్నీ నా బతుక్కి ఎదర్కొనాలు. వాలో దాగిన అందాలన్నీ పైకి తెచ్చి చూపించడానికి ఏ చిత్రకారుడో గాని చాలా ప్రయాసపడ్డాడు. మొత్తానికి అందరూ అనుకోడానికి అడవి అందాన్నంతా నాపై కప్పి చిత్రించాడు గాని... నన్ను ఈ మోడు వారిన చెట్టుకింద నిలబెట్టాడు. అతడు అలా చిత్రించడం తప్పా... లేదులే... నేను అడవి, కాచిన వెన్నెలను.. వసంతం నోచుకోని మోడును కదూ... ఆకురాలిన వసంతాన్నీ.. కదూ!

ఆనందమయీ మన ఇద్దరి బతుకులు ఒకటే... కాకపోతే నేను ఈ గూటిలో స్తబ్దంగా గోడకి శిలువవేయబడ్డాను. నీవు సంచరిస్తున్నావు అంతే తేడా!